తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





## రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు మృతి



కృష్ణయ్య, నందకుమారి (ఫైల్ ఫోటోలు)

పుత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త :

పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు... తొరూరు గ్రామానికి చెందిన రెడ్డి కృష్ణయ్య (75), భార్య నందకుమారి (65) సాయంత్రం ద్విచక్ర వాహనంపై పుత్తూరుకు వెళుతున్నారు. మార్గమధ్యంలో తొరూరు క్రాస్ నుంచి జాతీయ రహదారిని దాటుతుండగా అదే సమయంలో రేణిగుంట నుంచి నారాయణవనం వైపు బుల్లెట్‌పై వెళుతున్న ఒక వ్యక్తి వీరి వాహనాన్ని ఢీకొట్టాడు. సంఘటనలో భార్యభర్తలిరువురూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన కృష్ణయ్య గతంలో తొరూరు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

## స్కూల్ బస్సు బోల్తా - తప్పిన ప్రమాదం



బంగారుపాళ్యం, ఆగస్టు 7 ప్రభాతవార్త:

బంగారుపాళ్యంకు చెందిన ఓ ప్రైవేటు బస్సు విద్యార్థులను తీసుకువస్తూ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు ఎవరికి గాయాలు కాలేదు. దీంతో ఘోర ప్రమాదం తృటిలో తప్పింది. సోమవారం బంగారుపాళ్యంలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు దేగలబండ నుండి బంగారుపాళ్యంలోని పాఠశాలకు బయలుదేరింది. దేగలబండ చంద్రశేఖర్‌పురం గ్రామాలకు చెందిన ఏడు మంది విద్యార్థులు బస్సులో వున్నారు. దేగలబండ గ్రామ సమీపంలోని మలుపు వద్ద బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో బస్సు నందు ఏడుగురు విద్యార్థులు మాత్రమే వున్నారు. డ్రైవర్ అప్రమత్తమై బస్సులోని విద్యార్థులను డ్రైవింగ్ సీటు డోర్ నుండి బయటికి తెచ్చాడు. ఈ విషయం తెలిసిన వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులు, సెకండ్ ఎంఇఓ రమేష్, తహసిల్దారు బెన్నురాజ్, పాఠశాల సిబ్బంది సంఘటనా స్థలంకు చేరుకొన్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. బస్సు ఇంకొంచెం ముందకు వెళ్ళి వుంటే గోతిలో బోల్తా పడి ఘోర ప్రమాదం జరిగి వుండేది. జరిగిన విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు.

# ఆఖరు సమావేశంలోనూ అభివృద్ధికి పచ్చజెండా

**-రూ.24కోట్లతో ఘాట్‌రోడ్లలో రక్షణగోడలు -రూ.23.50కోట్లతో తిరుచానూరులో యాత్రికుల వసతి సముదాయం**

**-రూ.3కోట్లతో శ్రీనివాసం వద్ద సబ్‌వే -రూ.9.85కోట్లతో వకుళమాత ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి**



తిరుమల,ఆగస్టు 7ప్రభాతవార్తప్రతినిధి:

తమ బోర్డు ఆధ్వర్యంలో నాలుగేళ్ళ పాలనలో సామాన్యభక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పనదిశగా పనితీరు సాగించామని, అనేక సంస్కరణలు అమలుచేసి సామాన్యభక్తులకు దేవుని తొలిదర్శనం చేసుకునేలా మార్పులు చేయడం తనకెంతో ఆనందం కలిగించిందని టిటిడి బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. తిరుమల దర్శనానికి వచ్చే సామాన్యభక్తులకు వసతి, ఇతర సదుపాయాలు కల్పించేందుకు అనేక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ధర్మకర్తలమండలి చివరి సమావేశం సోమవారం తిరుమల అన్నమయ్యభవన్‌లో టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగింది. టిటిడి నూతన ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, బోర్డు సభ్యులు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పోకల అశోక్‌కుమార్, బుర్రామధుసూదన్‌యాదవ్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మూరంశెట్టి రాములు, ప్రసాద్, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి,జెఇఒలు సదాభార్గవి, వీరబ్రహ్మం తదితరులతో చివరి బోర్డు సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలను మీడియాప్రతినిధులకు వెల్లడించారు. తిరుమల ఘాట్‌రోడ్లలో ప్రమాదాలనివారణ లక్ష్యంగా 24కోట్ల రూపాయలతో రక్షణగోడలు నిర్మించేందుకు ప్రాధాన్యతనిచ్చారు. తిరుమలలో యాత్రికుల వసతి సముదాయం(పిఎసి 1)లో 2.50కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. శ్రీవారి ప్రసాదాలు, అన్నప్రసాదాల తయారీకి వినియోగించే వంటసరుకులను మరింత నాణ్యతగా పరిశోధించేందుకు వీలుగా 4.50కోట్లతో అత్యాధునిక యంత్ర పరికరాలు కొనుగోలు, తిరుమల వైకుంఠం క్యూకాంప్లెక్స్ తరహాలో తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయం చెంత భక్తులు వేచివుండేందుకు 23.50కోట్ల రూపాయలతో యాత్రికుల వసతిభవనం నిర్మాణం, తిరుపతిలో శ్రీనివాసం కాంప్లెక్స్ వద్ద 3కోట్లతో సబ్‌వే నిర్మాణం, 3.10కోట్ల రూపాయలతో శ్రీనివాసమంగాపురం కల్యాణవేంకటేశ్వర స్వామి ఆలయంలో పార్కింగ్ వసతి, మినీకల్యాణకట్ట, యాత్రికుల వసతికేంద్రం తదితర అభివృద్ధి పనులు, పేరూరు వకుళమాత ఆలయం ప్రాంగణంలో అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు సౌకర్యాల కల్పనకు 9.85కోట్ల రూపాయలతో చేపట్టేందుకు ఆమోదం తెలిపారు. తిరుపతి ఎస్వీవేదవిశ్వవిద్యాలయంలో 5కోట్లతో అభివృద్ధి పనులు, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రిలో 11.50కోట్ల రూపాయలతో అదనపు అంతస్తు నిర్మాణం, 2.60కోట్ల రూపాయలతో గ్రౌండ్‌ఫ్లోర్ అభివృద్ధి పనులు, 3కోట్లతో ఆయుర్వేద కళాశాల విద్యార్థినుల హాస్టల్ భవనంలో అదనంగా మరో రెండు అంతస్థుల నిర్మాణం, 2.20కోట్లతో తిరుపతి రూయా ఆస్పత్రిలో టిబి వార్డు నిర్మాణం, 1.65కోట్ల రూపాయలతో తిరుపతి పల్లివీధిలోని వేశాలమ్మ ఆలయం, తాళ్ళపాక పెద్దగంగమ్మఆలయం పునర్నిర్మాణం పనులకు ఆమోదం తెలిపారు. అంతకు ముందు 2019-2023 మధ్యకాలంలో టిటిడి ఛైర్మన్‌గా పనిచేసే అదృష్టం ప్రసాదించిన వేంకటేశ్వరస్వామికి,తనకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి,బోర్డు సభ్యులు, టిటిడి అధికారులు ఇఒ ఏవి ధర్మారెడ్డి, జెఇఒలు సదాభార్గవి, వీరబ్రహ్మంకు సుబ్బారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 10న టిటిడి ఛైర్మన్‌గా "భూమన" బాధ్యతలు

### -పాతబోర్డులో నలుగురైదుగురికి సభ్యులుగా అవకాశం!!



తిరుమల,ఆగస్టు 7ప్రభాతవార్తప్రతినిధి:

కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి సేవకుడిగా,టిటిడి ధర్మకర్తలమండలి ఛైర్మన్‌గా నియమితులైన తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి 10వతేదీ గురువారం ఆలయంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.ఆరోజు ఉదయం 11.44గంటలకు సుముహూర్తాన భక్తులసేవకు పునరంకితం కానున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు టిటిడి అధికారులు చేస్తున్నారు. ఛైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి నాయకత్వంలో నూతన బోర్డు కొలువుదీరాల్సి ఉంది. ఇప్పటికే బుధవారంతో ముగుస్తున్న పాతబోర్డులోని 29మంది సభ్యుల్లో నలుగురైదుగురికి తిరిగి సభ్యులుగా అవకాశం దక్కే సూచనలు ఉన్నాయి. టిటిడి ఛైర్మన్‌గా భూమన రెండవసారి ప్రమాణస్వీకారం చేపట్టనుండటంతో అటు టిటిడి ఉద్యోగుల్లో ఇటు శ్రీవారి భక్తుల్లో నూతన ఉత్సాహం కనిపిస్తోంది. గతంలో ఆయన 2006వ సంవత్సరం నుంచి 2008వరకు అప్పటి రాష్ట్రముఖ్యమంత్రి(ప్రస్తుత సిఎం వైఎస్ జగన్‌తండ్రి) వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో తొలిసారిగా టిటిడి ఛైర్మన్ బాధ్యతలు నిర్వహించారు. రానున్న రోజుల్లో వెంకన్న రెండు బ్రహ్మోత్సవాలు ఛైర్మన్ హోదాలో భూమన కరుణాకర్‌రెడ్డి సారధ్యంలో జరగనూన్నాయి.

## పక్కాగా పంచాయతీ ఉప ఎన్నికలు

### - నేటి నుండి నామినేషన్లు స్వీకరణ

### - జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు

చిత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త:

జిల్లాలో 26 మండలాల్లో 3 సర్పంచ్, 46 వార్డు స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో పంచాయతీ ఉప ఎన్నికలను పక్కాగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధికారులతో పంచాయతీ ఉప ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షిస్తూ జిల్లాలో గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లి, విజయపురం మండలం కాళికాపురం, కార్వేటినగరం మండలం కత్తెరపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలు, అలాగే 46 వార్డు సభ్యుల స్థానాలకు మంగళవారం నుండి నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు వుంటుందని, 11వ తేదీ నామినేషన్ల పరిశీలన, ఉపసంహారణ వుంటాయన్నారు. 12వ తేదీ అప్పీళ్ళు ఆర్డీఓల వద్ద జరుగుతాయని, అప్పీళ్ళ పరిష్కారం 13వ తేదీ, నామినేషన్ల ఉపసంహారణ 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు చేసుకోవచ్చునన్నారు. ఎన్నికల పోటీలో వున్న అభ్యర్థుల జాబితా 14వ తేదీ ప్రచురించడం జరుగుతుందని, ఈ నెల 19వ తేదీ పోలింగ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగుతుందన్నారు. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో వుంటుందని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.

## స్థానిక ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ సన్నద్ధం

### జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి



తిరుపతి క్రైం, ఆగస్టు 7, ప్రభాతవార్త

శాంతి భద్రతలకు ఎటువంటి ఆటంకం కలుగకుండా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం తిరుపతి సైబర్ సెల్ కాన్ఫిరెన్స్ హాల్ నుండి జూమ్ వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ గురించి జిల్లా పోలీసు అధికారులతో ఎస్పి పరమేశ్వర రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంది. పోలీసు అధికారులు సిబ్బంది ఎన్నికల ప్రవర్తన నియమాలని తూచా తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. డీఎస్పీలు, సిఐలు, ఎస్‌హెచ్‌లు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పూర్తిగా తెలుసుకుని బందోబస్తు విధులు నిర్వర్తించే సిబ్బందికి నియమావళి గురించి అవగాహన కల్పించాలన్నారు. పోలీసుల యొక్క ప్రవర్తన వల్ల జిల్లా వ్యాప్తంగా ఎక్కడగాని ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకూడదని అధికారులను ఆదేశించారు. పోలీంగ్ జరిగే ప్రాంతాలలో డిఎస్పిలు తప్పనిసరిగా పర్యటించి, క్షేత్రస్థాయిలో అక్కడ ఉన్న పరిస్థితులను సమీక్షించుకుని, తగిన బందోబస్తు ఏర్పాట్లను చేసుకోవాలని అన్నారు. నామినేషన్ల ప్రక్రియలో పోలీసులు సమతుల్యంగా వ్యవహరించి నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి. లైసెన్సు ఉన్న ఆయుధాలను వెంటనే సదరు ఎస్‌హెచ్‌ఓలు డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి వెంకటరావు పరిపాలన, కమాండ్ కంట్రోల్ డిఎస్పి రవికుమార్, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## నా భూమి - నా దేశం విజయవంతంకు పక్కా ఏర్పాట్లు

### - జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు

చిత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త:

జిల్లాలో రేపటి నుండి ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించే నా భూమి – నా దేశం, నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం కార్యక్రమం పక్కాగా విజయవంతం చేయడానికి ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అదికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జెసి పి.శ్రీనివాసులు డిఆర్‌ఓ రాజశేఖర్‌తో కలిసి నా భూమి – నా దేశం, నేలతల్లికి నమస్కారం – వీరులకు వందనం, జగనన్నకు చెబుదాం, సివిల్ వివాదాలు పరిష్కారానికి మండల, జిల్లా స్థాయి సమన్వయ కమిటీల ఏర్పాటుకు చర్యలు తదితర అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షిస్తూ మండల స్థాయి తహసిల్దార్లు, ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ నా భూమి – నా దేశం, నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం కార్యక్రమం అన్ని గ్రామ పంచాయతీలు, మండల ప్రధాన కార్యాలయాలు, పట్టణ ప్రాంతాల్లో విజయవంతంగా నిర్వహించాలన్నారు. పంచాయతీ సర్పంచ్ స్థాయి సమన్వయ అధికారిగా వ్యవహరిస్తారని, మండల స్థాయిలో ఎంపిడిఓలు మండల స్థాయి సమన్వయ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. గ్రామ పంచాయతీల్లో శిలా ఫలకాల నిర్మాణాలు డ్వామా పిడి చేపట్టాలని, శిలా ఫలకాల నిర్మాణ స్థలాలను జడ్పీ సిఇఓ పర్యవేక్షించాలన్నారు. జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఇ విజయకుమార్‌రెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమా మహేశ్వర్‌రెడ్డి, డ్వామా పిడి గంగా భవానీ, డిఆర్‌డిఏ పిడి డిఎంకె తులసీ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, సిపిఓ ఉమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసిల్దార్లు, ఎంపిడిఓలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## రావణాసుర వాహనంపై కుమారస్వామి

### కుమారస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో జరుగుతున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవమూర్తులకు శ్రీకాళహస్తీశ్వరాలయంలో సరా ్వంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపి హారతులిచ్చారు. అనంతరం స్వామివారిని రావణాసుర వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పలువురు భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు బారులు తీరారు. ఉత్సవం ముందు మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమకొనసాగింది. పలువురు భక్తులు స్వామిఅమ్మవార్లకు హారతులిచ్చి మొక్కులుతీర్చుకున్నారు. ఆలయాధికారులు, ఉభయదారులు పాల్గొన్నారు. ఉత్సవాన్ని ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హారతులిచ్చి ప్రారంభించారు.ఉత్సవం తేరువీధి నుంచి నెహ్రూవీధి,బాబూ అగ్రహారం,నగరి వీధి, బజారువీధుల్లో ఉత్సవం సాగింది.

## రాజ్యాంగ సృష్టికర్త .... ప్రపంచ మేధవి అంబేద్కర్

### డిప్యూటీసీఎం నారాయణస్వామి



వెదురుకుప్పం, ఆగస్టు 7 ప్రభాతవార్త :

రాజ్యాంగ సృష్టికర్త ప్రపంచ మేధవి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి శ్లాఘించారు. మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయితీ పరిధిలోని దేవళంపేట కూడలిలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహంను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోవింద్ అధ్యతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ వారి పాలన నుంచి పరిపాలన భారతీయులు పుచ్చుకోవడంకు కావలసిన విధివిధానాలు రూపొందించడంలో రాజ్యాంగం తయారు చేసిన గొప్ప మేధవి అంబేద్కర్ అని కొనియాడారు. అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో పయనించాలని చూచించారు. గొప్పవారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగడం వలన యువత అభివృద్ధి చెంది ఉన్నత స్థాయిలో ఉంటారని చెప్పారు. అలాగే పలువురు వక్తలు అంబేద్కర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, పుతలపట్టు ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు, రాష్ట్ర ఆర్టీసీ ఉపాధ్యక్షులు యంసీ విజయనంద రెడ్డి, నాయకులు గోవర్ధర్ రెడ్డి, చలం పాళ్యం సుకుమార్, నాయకులు పురుషోత్తం, రాణెమ్మ, ధనంజేయులు రెడ్డి, కామసాని పద్మనాభ రెడ్డి,నారాయణ రెడ్డి, సుబ్రమణ్యం, పెద్ద సంఖ్యలో స్థానిక యువకులు తదితరులు పాల్గొన్నారు.

## స్పందనకు 229 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు


చిత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా సచివాలయంలో ప్రతి సోమవారం కలెక్టర్ సగలి షన్మోహన్ నిర్వహించే స్పందన కార్యక్రమానికి ఈ వారం సమస్యలపై ప్రజల నుండి 229 అర్జీ లు అందాయి. స్పందన కార్యక్రమానికి హాజరైన జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## స్పందన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 7, ప్రభాతవార్త



స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత కాలవ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలకు అర్ధవంతంగా పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమ వారం ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్‌డిసి శ్రీనివాసులు, భాస్కర్ నాయుడు, ఏఓ జయరాములతో కలిసి స్పందన గ్రీవెన్స్ అర్జీలను జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. స్పందన ఆన్‌లైన్ నమోదుతో రసీదులు అందించారు. మొత్తం 172 వినతులు రావడం జరిగిందని జిల్లా అధికారులు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాల్సిందిగా స్పందనకు హాజరైన వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

# ఏడాదిగా గడపదాటని బట్టర్‌ఫ్లై లైట్ల ప్రతిపాదనలు


**శ్రీకాళహస్తీశ్వరాలయంలో అభివృద్ధి పనులకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారుల తీరు తీసికట్టుగా మారింది. ఆలయంలో కాంట్రాక్టర్లు తీసుకున్న నిర్మాణ పనులు నత్తనడకను మరిపిస్తున్నా పట్టించుకోరు.అభివృద్ధికి సంబంధించి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి దూకుడుతో అధికారులు పరుగులు తీయలేక పోతున్నారు. ఎంఎల్‌ఏ గెలిచినప్పటి నుంచి పట్టణంలోని నాలుగు మాడావీధుల్లో విద్యుత్ లైన్లు, స్థలంభాలు కనబడకూడ దని 'అండర్‌గ్రౌండ్' కేబుల్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిం చారు. ఏడాదిగా పనులను పూర్తి చేసారు.కానీ బట్టర్‌ఫ్లై లైట్లు ఏర్పాటుకు సంబంధించి దేవస్థానం ఇప్పటి వరకు కమిషనర్ అనుమతి కోసం వెళ్ళలేదంటే ఇక్కడ పని తీరు అర్థమౌతుంది.**

శ్రీకాళహస్తి,ఆగస్టు 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన మున్సిపల్ పాలన ఒకదానితో ఒకటి ముడిపడి ఉంది. అయితే గత కొంత కాలంగా దేవస్థానం అధికారులు దేవస్థానం వేరు, మున్సిపాలిటి పట్టణం వేరు అన్నట్లు మారింది. టిటిడి నిధులతో తిరుపతి అభివృద్దిలో భాగస్వాములౌతుంటే శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు నిబంధనలు ఒప్పుకోవని పేచీలు పెడుతున్నారు. మున్సిపాలిటిలో వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎలాంటి సహాయ సహకారాలు అందింటం లేదు.

**ఏడాది క్రితం ప్రతిపాదనలు:ఆచరణకు పెట్టని అధికార గణం:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి సందర్భంగా రథోత్సవం సందర్భంగా విద్యుత్ స్థంబాలు అడ్డురావటం అంతరాయం కల్గుతుండటంతో ఇక్కడ భూగర్భ విద్యుత్ కేబుల్‌ను ఏర్పాటు చేయాలని శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి మహోన్నత లక్ష్యంతో ప్రతిపాదించారు.ఈ నేపధ్యంలో విద్యుత్ శాఖ రూ.15కోట్లు వెచ్చించి కేబుల్ ఏర్పాటు చేసారు. అయితే స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులను ఆకట్టుకునే రీతిలో బట్టర్‌ఫ్లై లైట్లను ఏర్పాటుకు 2021 మహాశివరాత్రి నుంచి ప్రతిపాదిస్తున్నారు.కానీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఎలాంటి లైట్లు ఏర్పాటు చేయాలనే



నాలుగుమాడావీధుల్లో ఏర్పాటు చేయనున్న బట్టర్‌ఫ్లైలైట్లు చిత్రం

నమూనాలను కూడా ఎంఎల్‌ఏ ఖరారు చేసారు. అయినా దేవస్థానం అధికారుల్లో చలనం లేదు.ఇందుకు సుమారు రూ.2కోట్లు అవుతుందని అంచనా. ఈ మేరకు ఏడాదిగా ఎంఎల్‌ఏ చెబుతున్నా తలలూంచే అధికారులు ఫైల్‌ను మాత్రం ముందుకు కదిలించలేదు. ప్రస్తుతం కేబుల్‌పని పూర్తి అయ్యింది. ఆ కాంట్రాక్టర్ వెళ్ళాలంటే పనిలోని నాలుగుమాడావీధుల్లోని విద్యుత్ స్థంబాలను తొలగించాలి. అలా చేస్తే పట్టణం చీకట్లో చిక్కుకుంటుంది. అయితే దేవస్థానం ఈ ఫైలును ఇప్పటి వరకు కదిలించలేదు. ఎంఎల్‌ఏ ఏమో పనులు అయిపోతున్నాయనే భ్రమలో ఉన్నారు.

**ఇఒ వివరణ:**

ఈ సమస్యకు సంబంధించి ప్రభాతవార్త దేవస్థానం ఇఒ నూకారత్నంను వివరణకోరగా ఈ ఫైల్‌కు సంబంధించి తనకు అవగాహన లేదన్నారు.తాను కొత్తగా వచ్చానని ఇఓ ఆదేశిస్తే ఎఫైల్ సిద్దం చేస్తామని వివరించారు.మరి టెండర్‌మాటేమిటని ప్రశ్నిస్తే ఇఓ ఆదేశిస్తే అంచనాలు తయారుచేసి కమిషనర్ ఆమోదానికి పంపుతామన్నారు.అక్కడ నుంచి అనుమతి వస్తే వెంటనే టెండర్లు పిలుస్తామని వివరణ ఇచ్చారు. అంటే ఈ తతంగం అయ్యే వరకు కనీసం మరో నాలుగైదునెలలు పడుతుంది. ప్రాజెక్టు పనులు చేపట్టినప్పటి నుంచే చేపట్టి ఉంటే ఈ పాటికి ఆ పనులు కూడా ప్రారంభమయ్యేవి కదా? అని ప్రశ్నిస్తే తాను కొత్త కాబట్టి తనకు అవగాహన లేదని వివరణ ఇచ్చారు.

# తిరుపతి డివిజన్

## తొలగిస్తే అన్ని తొలగించండి... లేదంటే ముట్టడిస్తాం

### శ్రీకాళహస్తిలో ఫ్లెక్సీల లొల్లి

శ్రీకాళహస్తి, ఆగస్టు 7 ప్రభాతవార్త :శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని శ్రీకాళహస్తి తెలుగుదేశం ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అధికారులను కోరారు. సోమవారం పట్టణంలోని పానగల్‌లో తెలుగుదేశం ఫ్లెక్సీలను తొలగించే కార్యక్రమాలను మున్సిపల్ ఉద్యోగులు చేపట్టారు. పానగల్‌లోని స్వర్ణముఖి నదిపై నారా చంద్రబాబునాయుడు రణభేరి కార్యక్రమాలకు వస్తున్నపుడు స్వాగత ఫ్లెక్సీలను భారీ ఎత్తున కట్టారు. వాటిని తొలగించే కార్యక్రమాలను మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది తొలగింపు చేపట్టారు. దాంతో తెలుగుదేశం ఇన్‌చార్జి సుధీర్‌రెడ్డి ఆగ్రహించారు. తెలుగుదేశం నాయకులతో కలసి మున్సిపల్ కార్యాలయం వద్ద చేరుకున్నారు. మున్సిపల్ మేనేజర్ ఉమామహేశ్వరరావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి మున్సిపల్ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.పట్టణంలో కొంత కాలంగా స్థానిక శాసనసభ్యుడు వైకాపా నాయకుడు బియ్యపు మధుసూధనరెడ్డి శ్రీకాళహస్తీశ్వరుడు కనబడకుండా ఆర్చిలు నిర్మించుకున్నారు. వాటిని ఎందుకు తొలగించరు? అలాగే పలు కూడలి ప్రాంతాల్లో ఎంఎల్ఏ ఫ్లెక్సీలు, బ్యానర్లు, ఆర్చిలు ఉంటే పట్టించుకోకుండా తెలుగుదేశం బ్యానర్లను తొలగించి తమ స్వామి భక్తిని ప్రదర్శించుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇదేమి అని కమిషనర్‌ను ప్రశ్నిస్తే 'ప్రెషర్,ప్రెషర్' అంటూ దాటవేస్తున్నారని వివరించారు. తాము వస్తునామంటే ఇక్కడ ఒక్క అధికారి లేదని, మేనేజర్ ఉమామహేశ్వరరావుకు వినతి పత్రం అందిస్తున్నామని, మార్పు రాకుంటే మున్సిపల్ కార్యాలయాన్ని



ముట్టడిస్తామని సుధీర్‌రెడ్డి స్పష్టం చేసారు. ఆందోళనలో పట్టణ అధ్యక్షుడు జి.విజయ కుమార్,రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భక్తి భావాన్ని పెంపొందించింది

తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త : తిరుపతికి చెందిన శతవధాని ఉప్పలధడియం భరత్ శర్మచే నిర్వహింపబడిన విష్ణుపురాణం ప్రవచనం ఆహూతులలో భక్తి భావాన్ని పెంపొందించింది. సోమవారం సాయంత్రం టిటిడి వారి తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో శతవధాని ఉప్పలధడియం భరత్ శర్మ విష్ణుపురాణం ప్రవచనం చేశారు. స్వతహాగా అవధాని కూడా అయిన భరత్ శర్మ తనదైన శైలిలో పద్యాలను రాగయుక్తంగా ఆలపించి, హృద్యంగా పురాణ ప్రవచనం నిర్వహించారు. ప్రవచనకర్త భరత్ శర్మను రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి, సభ్యులు శాలువాతో సత్కరించారు.

## కృష్ణదేవరాయలు విగ్రహానికి...పూలాభిషేకం

తిరుపతి,ఆగస్టు 7ప్రభాతవార్త: శ్రీకృష్ణదేవరాయలు 514వ పట్టాభిషేకం దినోత్సవం సందర్భంగా సోమవారం తిరుపతి కాపునాడు నేతల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలాభిషేకం చేశారు. కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కరుణానిధి, ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు సరితా డి.నాగరాజు, విశ్రాంత బ్యాంకు మేనేజర్ డాక్టర్ జిఎన్ ప్రసాద్, కాపునాడు నాయకులు పసుపులేటి విజయ్, చిట్టిసిద్దయ్య, ఎల్.కృష్ణయ్య, సాయిప్రకాశ్, జివి చలసతి,ఆచార్య ఈశ్వరప్రసాద్, మురళి తమ్మిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత వ్యాపారులను ఆదుకుందాం




తిరుపతి,ఆగస్టు 7ప్రభాతవార్త: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం గాందీరోడ్డులోని ఖాదీభాండార్‌లో బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, విజయకల్యాణి, మంజుల,రాధ తదితరులు ఖాదీదుస్తులు కొనుగోలుచేశారు. వారంలో ఒకరోజు చేనేత దుస్తులు ధరించి వారసత్వం చాటుదామన్నారు.

## అందరికి మంచి జరగాలి : చెవిరెడ్డి



తిరుమల,ఆగస్టు 7ప్రభాతవార్తప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని వేడుకున్నట్లు చంద్రగిరి ఎమ్మెల్యే, తుడ ఛైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం డాక్టర్ చెవిరెడ్డి దంపతులు స్వామివారిని విఐపి బ్రేక్‌లో దర్శించుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## నగరి సీఐగా సురేష్

నగరి, ఆగస్టు 7 ప్రభాతవార్త: నగరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.ఎన్.సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకే ఉన్న సీఐ శ్రీనివాసంతి బదిలీపై నగరి రూరల్ స్టేషన్ నింద్రకు వెళ్ళడంతో వాయల్పాడు నుంచి బదిలీపై సురేష్ విచ్చేశారు. సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతలపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తానన్నారు.

## ఐసిడియస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడిల ధర్నా



శ్రీకాళహస్తి,ఆగస్టు 7 ప్రభాతవార్త : ముచ్చివోలు దళితవాడలో పని చేస్తున్న అంగన్‌వాడి హెల్పర్‌పై వేధింపులకు నిరసనగా సోమవారం శ్రీకాళహస్తిలో భారీ ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు. ఎపి ప్రగతి శీల అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ సారధ్యంలో పంచాయతీరాజ్ అతిథి గృహం వద్ద నుంచి అంగన్‌వాడి కార్యకర్తలు,మినీ వర్కర్లు,హెల్పర్లు భారీ ఎత్తున ర్యాలి జరిపి ఐసిడియస్ కార్యాలయం వద్ద ధర్నా జరిపారు.ఈ సమస్యను పలుమార్లు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి దృష్టికి తీసుకొచ్చినా ప్రయోజనం లేదని వాపోయారు. ఇదే వేధింపులు మరో సారి కొనసాగితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ అన్నారు.ఈ కార్యక్రమాల్లో అధ్యక్ష, కార్యదర్శులు కల్పన, శోభ,స్వర్ణ, ప్రాజెక్టు కమిటి వసంత, సురేఖ, మనీశ్రీ, మన్నెమ్మ, శాంతకుమారి, జహీరా,సునీత, జయంతి, భారతి, కౌసల్య,సుకుమారి తదితరులు పాల్గొన్నారు.

## అమృత సరోవర్‌ను అభివృద్ధి చేద్దాం



ఏర్పేడు (శ్రీకాళహస్తిరూరల్), ఆగస్టు 7 ప్రభాతవార్త : అమృత సరోవర్ అభివృద్ధితో స్వచ్ఛమైన మంచినీటి సరఫరాకు అవకాశం ఉందని ప్రతినిధి అమృత్ సరోవర్ పర్యవేక్షకురాలు డాక్టర్ లీలావతి వివరించారు. సోమవారం ఆమె మండలంలోని బండారుపల్లి పంచాయతీలో చేపట్టిన తామరగుంటను పూర్వ చరిత్రను ఆమె పరిశీలించారు. గ్రామానికి చెందిన పంచాయతీ ప్రతినిధి ఎస్‌చెంచురెడ్డి, ఉప ఎంపిపి తిరుపతి జనార్ధన్‌రెడ్డిలు ఎంతో కాలంగా నీళ్ళు లేక ఎండిపోయిన తామర గుంటను అభివృద్ధికి అమృతసరోవర్ పథకంలో అభివృద్ధి పరచారు.ఉపాధి హామీ పథకంలో గుంటలో పూడిక తీయించారు. కట్టలు బలోపేతం చేసుకున్నారు. దాంతో నీరు చేరిందని నిలిచిందని వివరించారు. అమృతసరోవర్ వద్ద పంంగ వాతావరణంలో ముగ్గుల పోటీలు అరటి ఆకులతో తోరణాలు చుట్టూ చెట్లు పెంపకంతో బండారు పల్లి రూపు రేఖలు మారిపోయాయని డాక్టర్ లీలావతి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ఎంపిపి జనార్ధన్‌రెడ్డి, పుత్తూరు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.హరిత,శ్రీకాళహస్తి క్లస్టర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్, సిడిసిల్‌ఆర్పి డి.చంద్రశేఖర్ రాజు, ఎపిఏ అవిలాల దేవెరి జూనియర్ ఇంజనీర్ పి.బాలాజిరావ్, కే.రవీంద్రుడు, ఎస్ మనోహర్,ఎం పట్టాభిరెడ్డి, వెంకట్రాది, పి.వెంకటేష్‌రెడ్డి, మునీంద్రవర్మ, చంద్రశేఖర్, ముంజుల, యతీశంకర్, చంద్రయ్య ఈశ్వరయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధర్మమార్గంలో నడవని జీవితం నిరర్ధకం : విద్యాస్వరూపానందగిరి



శ్రీకాళహస్తి,ఆగస్టు 7 ప్రభాతవార్త : మానవుడు ధర్మాన్ని విస్మరించి దారి తప్పితే ప్రకృతి కట్టడి చేస్తుందని శ్రీ శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపా నందగిరి స్వామి అన్నారు. శ్రీశుకబ్రహ్మాశ్రమ సారధ్యంలో భగవద్గీత సప్తవాహంను ఏర్పాటు చేసారు. సోమవారం ఏర్పాట్లను శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పర్యవేక్షించారు. దేవస్థానంకు అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మగుడి ఆవరణలో సభలకు చైర్మెన్‌జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీకారం చుట్టారు. పీఠాధిపతి విద్యాస్వరూపా నందగిరి స్వామి మాట్లాడుతూ మానవుడు తన జీవిత రహస్యాన్ని తెలుసుకొని ధర్మమార్గంలో నడవాలని మానవుడు ధర్మం తప్పితే ప్రకృతి అదుపు చేస్తుందన్నారు. ప్రకృతి ధర్మం తప్పితే సృష్టిఎలా అల్లకల్లోలం అవుతుందో ఇటీవల సంభవిస్తున్న విపత్తులే తార్కాణం అన్నారు. మానవుడు దర్మమార్గంలో సాగకపోతే జీవనం వ్యర్థమని భగవద్గీత మానవుని సన్మార్గంలో నడిపే దిక్సూచి అని వివరించారు.మన ధర్మాన్ని మనం ఆచరిస్తూ భగవదనుగ్రహం పొందాలని సూచించారు. భగవద్గీత సప్తాహంలో మొదటి రోజు శ్రీనివాసరామానుజన్ చార్యులు భగవద్గీతలో భక్తి యోగం మనిషిని భక్తిమార్గంలో ఎలా సాగాలో వివరిస్తుందని తెలిపారు.భగవద్గీత పారాయణం కాదు అనుష్టానం అన్నారు.

## పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా జాయింట్ కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 7 ప్రభాతవార్త : ఐదు సంవత్సరాల లోపు పిల్లలు, గర్భిణీలకు టీకాలతో రోగ నిరోధక శక్తిని అందించాలనే లక్ష్యంతో మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మిషన్ ఇంద్రధనస్సు పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సంరక్షణ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి గర్భవతులు, ఐదు సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి టీకాలు వేసి వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆగస్టు 7వ తేది నుంచి 12వ తేది సెప్టెంబర్ 11వ తేది నుండి 16 వరకు, అక్టోబర్ 9 నుంచి 14వ తేది వరకు ఈ కార్యక్రమాన్ని మూడు విడతలలో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీహరి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డా. శాంత కుమారి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జయలక్ష్మి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని అరుణ సులోచన దేవి, జిల్లా మలేరియా అధికారి డా. రూప్ కుమార్, డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ

పుత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త : స్థానిక డిగ్రీ కాలేజీ ఆవరణలో వున్న స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు సంబంధించి ఉచిత శిక్షణ అందించనున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. కోర్సులో చేరేందుకు డిగ్రీ లేదా పదో తరగతి పాసై వుండాలని తెలిపారు. ఈ నెల 15వ తేదీ లోగా శిక్షణ పొందేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆసక్తి వున్న అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కోసం ఎస్.రసూల్ (6300954441) మొబైల్ నెంబరుకు సంప్రదించాలని తెలిపారు.

## రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

పుత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త : పుత్తూరులో సోమవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... పట్టణంలోని కాపు వీధికి చెందిన యువకులు గౌతమ్ (28), బద్రి (30) సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై తిరుపతికి బయలుదేశారు. ఓవర్ బ్రిడ్జి దాటుతుండగా వాహనం అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రుయాకు తరలించారు. అలాగే మండల పరిధిలోని శిరుగురాజుపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వడమాలపేట మండలం ఎస్‌బిఆర్ పురం ఆదిఆంధ్రవాడకు చెందిన రమేష్ (45) ద్విచక్ర వాహనంపై శిరుగురాజుపాలెం వద్ద రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి చెన్నై వైపు వెళుతున్న తమిళనాడు ఆర్టీసి బస్సు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన రమేష్‌ను చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు.

## నేతన్నలను ఆదుకుంటున్న జగనన్నను ఆదరించండి: ఎమ్మెల్యే



నారాయణవనం, ఆగస్టు 7 ప్రభాతవార్త : చేనేత కార్మికులకు ప్రతి ఏడాది 24 వేల రూపాయాలను అందించి ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆదరించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మండలకేంద్రంలోని తాతా సొరకాయుల స్వామి కల్యాణ మండపంలో సోమవారం మధ్యాహ్నం 3గంటలకు నేతన్న నేస్తం చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చేనేత కార్మికులకు ఇచ్చిన హామి మేరకు ప్రతి ఏడాది అర్హత కలిగిన ప్రతి ఒక్క కార్మికునికి 24 వేల రూపాయాలను అందిస్తున్న ఆదుకుంటున్నట్టు గుర్తు చేశారు. ప్రస్తుతం 5 విడతలో మండలంలోని 341 మంది లబ్దిదారులకు గాను 81,84000 లక్షల రూపాయాలను అందిస్తున్న గుర్తు చేశారు. అనంతరం చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌలీ శాఖ ఎడిఓ సుబ్బానాయుడు, కరుణకుమారి, రవి, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి పి సుదర్శన్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, డిసిసిబి డైరెక్టర్ ఊరప్ప, మండల సచివాలయం కన్వీనర్ కె బాబు, ఎంపిడిఓ గుణశేఖర్, పంచాయతీ ఇఓ షణ్ముగం, నాయకులు ఆర్‌డి ఏకాంబరం, అన్నాదొరై, గుడ్డల గురుస్వామి, మోహన్, మనోహర్, దిల్లీ, సొరకాయులు, సోడా మణిరెడ్డి, దొరైరాజ్, గోవిందశెట్టి, చేనేత కార్మికులు అందరు పాల్గొన్నారు.

## నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవం



నగరి, ఆగస్టు 6 ప్రభాతవార్త: భారతదేశంలో వ్యవసాయం తరువాత అత్యధిక జనాభాకు ఉద్యోగ అవకాశాలు కల్పించే రంగంచేనేత అనఇ దీనిని కాపాడుకోవడం, గౌరవించుకోవడం ప్రతి భారతీయుడి కర్తవ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేణుగోపాల్ తెలియజేశారు. సోమవారం కళాశాలలో సాంస్కృతిక విభాగం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బ్రిటీష్ వారు భారతదేశంలో తీవ్రంగా దెబ్బతీసిన మొదటి వృత్తిచేనేత అని తెలిపారు. భారతదేశంలో వ్యవసాయం తరువాత రెండవ అదిపెద్ద ఉద్యోగ కల్పనా రంగమైన చేనేతను తమ ఎగుమతి-దిగుమతి విధానం ద్వారా బలహీనపరచడం కారణంగా కోట్లాది ప్రజలను పేదరికంలోకి నెట్టివేశారని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డా. భాస్కర్‌రాజు మాట్లాడుతూ చేనేత రంగంలో భారతీయుల నైపుణ్యం ప్రపంచం గర్వించదగిన స్థాయిలో ఉండేదని తెలిపారు. కళాశాల సాంస్కృతిక విభాగం కో-ఆర్డినేటర్ డా. అరుణ కుమారి మాట్లాడుతూ చేనేతను ఒక జీవన విధానంగా భావించి దానిని గౌరవించి, ఆదరించి, ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. పీజీ కో-ఆర్డినేటర్ డా. వేణుగోపాల్ మాట్లాడుతూ చేనేత కార్మికుల శ్రమను, నైపుణ్యాన్ని కొనియాడారు.అనంతరం విద్యార్థులకు వ్యాసరచ, వకృత్వం, చేనేత వస్త్రాలను ధరించిన వారితో ఫ్యాషన్ షో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.స్వాతి, డా.శ్రీలక్ష్మి, డా.పంకజ, డా.రేవతి, రెడ్డి నాయక్, మహేశ్వరి, రామాంజులు, శివలక్ష్మి, సురేష్, లాల్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

## మండలంలో జాతీయ చేనేత దినోత్సవం

పుత్తూరురూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త: పుత్తూరు మండలం రామకృష్ణాపురం పంచాయతీ గొల్లపల్లి గ్రామసచివాలయంలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విరిత దేవేందర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ ముని నరేష్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ హరినాథ్‌రెడ్డి, వైసీపీ నాయకులు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సచివాలయంలో మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమం



పుత్తూరురూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త: పుత్తూరు మండలంలోని వేపగుంట సచివాలయంలో మిషన్ ఇంధ్ర ధనస్సు కార్యమ్రాన్ని పుత్తూరు మండలం ఎంపీపీ మునివేలు ప్రారంభించారు. పరమేశ్వరమంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని అన్ని సచివాలయాల్లో వ్యాధి నిరోధక టీకాలు వేసుకోకుండా తప్పిపోయి ఉన్న పిల్లలందరికి సోమవారం నుంచి 12 తేదీ వరకు మిషన్ ఇంధ్ర ధనస్సు కార్యక్రమం పూర్తి చేస్తారన్నారు. డాక్టర్ కల్యాణి, రమేష్ బాబు, ఆరోగ్య విస్తరణాధికారి లలిత, హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులాల రైతులకు పిఎండిఎస్ కిట్స్ అందజేత

తిరుపతిరూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గంలో పిఎం- ఎజెఎవై పథకం కింద అర్హత సాధించిన 221 మంది షెడ్యూల్డ్ కులముల రైతులకు సోమవారం ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రూ.9.500 రుపాయాలు విలువ చేసే పిఎండిఎస్ కిట్స్‌తో పాటు సీడ్స్ కిట్స్, కిచెన్ గార్డెన్ కిట్స్‌ను అందజేసారు. ఆ కిట్స్‌లో 14 రకాల విత్తనాలు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరసింహులు, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

## మహిళా విశ్వవిద్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు

తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో హోం సైన్స్ విభాగం ఆధ్వర్యంలో వడమాలపేట మండలం కాయం ఎస్టీ కాలనీలో తల్లిపాల వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్వాడి కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు. ర్యాలీతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. డా.ఎస్. శాంతి శ్రీ, ఉద్యోగస్థులైన తల్లులు తమ పిల్లలకు తల్లిపాలు కొనసాగించడానికి సహకరిద్దామని తెలిపారు. సిడిపిఓ కె. పద్మజ మాట్లాడుతూ నేటి ఆరోగ్యకరమైన బిడ్డే, రేపటి ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని తెలియజేసారు.

## తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం

తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్ర రీడర్ డాక్టర్ రమాదేవి ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పులిపట్లలోని గ్రామ సచివాలయం తిరుపతి రూరల్ నందు 07/08/23వ తేదీన తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని స్వయం సహాయక సంఘ మహిళలకు నిర్వహించారు. మహిళా అధ్యయన కేంద్ర రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ ఈ కోన ప్రభ ఎమరాల్స్ డిగ్రీ కాలేజ్‌లోని విద్యార్థులకు తల్లిపాల ప్రాముఖ్యత అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం, విభాగం హుమానిటీస్ బ్లాక్‌లో తల్లిబిడ్డకు పాలు ఇవ్వడం తల్లికి బిడ్డకు, భూమికి ఒక బహుమతి అన్న అంశంపై విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోషల్ సైన్సెస్ డీన్ అనురాధ, మహిళా అధ్యయన కేంద్ర, విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా అవగాహన ర్యాలీ




తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాలలోని హోం సైన్స్ విభాగం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, తల్లి పాలలోని పోషక విలువలు, తల్లిపాల వలన తల్లికి, బిడ్డకు కలిగే ప్రయోజ నాలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. కె. మహదేవమ్మ పర్యవేక్షణలో హోంసైన్స్ విభాగ అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## చరిత్ర భవిష్యత్ తరాలకు దండిమార్చ్ విగ్రహా : కమీషనర్



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 7 ప్రభాతవార్త : భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన వారి చరిత్ర భవిష్యత్ తరాలకు కళ్ళకు కట్టినట్టు తెలిసేలా దండి మార్చ్ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత పేర్కొన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని ముత్యాలరెడ్డి పల్లి కూడలి వద్ద ఏర్పాటు చేస్తున్న దండిమార్చ్ విగ్రహాలను సోమవారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజల సౌకర్యార్ధం అనేక అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే 13 మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డిఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడికృత్తిక సందర్భంగా తిరుత్తణికి ప్రత్యేక సర్వీసులు

### -ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి జితేంద్రనాథ్‌రెడ్డి

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 7 ప్రభాతవార్త: నేడు మంగళవారం భరణి,9వ తేదీ ఆడికృత్తిక పర్వదినాలను పురస్కరించుకుని తమిళనాడులోని తిరుత్తణి,పాకాల సమీపంలోని ఊట్లవారిపల్లికి భక్తుల సౌకర్యార్థం ఏపిఎస్ ఆర్టీసీ 210 ప్రత్యేక సీర్వసులను 8,9,10 తేదీలలో మూడు రోజుల పాటు నడపనున్నట్లు తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి టి.జితేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఇందులో మంగళం డిపో నుండి తిరుపతి-తిరుత్తణి వయా నగరి 14 బస్సులు,తిరుపతి డిపో నుండి పచ్చికాపల్లం-తిరుత్తణి వయా నగరి 26,పుత్తూరు డిపో పుండి పుత్తూరు-తిరుత్తణి వయా పళ్లిపట్టు 14,పుత్తూరు- తిరుత్తణి వయా నగరి 36,నగరి-తిరుత్తణి 15,కొత్తపల్లిమిట్ట-తిరుత్తణి వయా నగరి 45,సత్యవేడు డిపో నుండి సత్యవేడు-తిరుత్తణి వయా నాగలాపురం 30,నాగలాపురం-తిరుత్తణి 15,తిరుపతి డిపో నుండి తిరుపతి-ఊట్లవారిపల్లికి 15 బస్సులతో కలిపి మొత్తం 210 బస్సులను నడపనున్నట్లు ఆయన వివరించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్సులను తిప్పాలని ఆయా డిపో మేనేజర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని డిపిటిఓ తెలిపారు.

## బోగస్ ఓట్ల ఏరివేతకు నిశిత పరిశీలన

చంద్రగిరి, ఆగస్టు 7 ప్రభాతవార్త: బోగస్ ఓట్ల ఏరివేతకు ప్రతి కుటుంబంలోని వ్యక్తుల వివరాలను నిశితంగా పరిశీలించాలని తహశీల్దార్ శిరీషా అన్నారు. స్థానిక చర్చివీధిలో ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని వ్యక్తుల వివరాలు, ఇక్కడ నివశిస్తున్న వారి ఓట్లకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అదేవిధంగా మరణించిన వారి వివరాలను తెలియజేసి స్వచ్ఛంధంగా ఓటును తొలగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సులోచనమ్మ, విఆర్ఓ భాస్కర్, టిడిపి మైనార్టీ నాయకుడు హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బోధనా సామగ్రి వితరణ

విజయపురం, ఆగస్టు 7ప్రభాతవార్త : మండలంలోని మహావీరపురం, క్షూరికాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు భాస్కర్‌రాజు సోమవారం బోధనా సామగ్రి అందించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. పెన్నులు, క్రయాన్స్, పెన్సిళ్లు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, రత్న తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హరిత రాయబారుల వేతన బకాయిలు చెల్లించండి



సత్యవేడు, ఆగష్టు7 ప్రభాతవార్త: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించి, పారిశుద్ధ్య చర్యలు చేపట్టే హరిత రాయబారుల వేతన బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలంటూ సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో హరితరాయబారులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో హరితరాయబారులు శేఖర్, సుబ్రమణ్యం, మునస్వామి, దానమ్మ, సంపూర్ణమ్మ, సుబ్రమణ్యం గోవిందయ్యలు పాల్గొన్నారు.

## తెలుగుయువత నాయకుడుని పరామర్శించిన 'గాలి బ్రదర్స్'.



తొట్టంబేడు, ఆగస్టు 7 ప్రభాతవార్త : ఇటీవల డెంగ్యూ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొంది అరోగ్యంగా ఇంటికి తిరిగి వచ్చిన కొణతనేరి గ్రామ కాపురస్తుడు ఉన్నం విజయభాస్కర్‌ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, టిడిపి తొట్టంబేడు మండలం అధ్యక్షుడు గాలి మురళీ నాయుడు మరియు మాజీ పార్టీ అధ్యక్షుడు చింతపట్ల భాస్కర్‌నాయుడు, రైతు అధ్యక్షుడు చెరుకూరి శంకర్ నాయుడు, కాశితాతయ్యలు పాల్గొని ఆరోగ్యంగా ఉండి త్వరగా కోలుకోవాలన్నారు.

## సుధీర్‌రెడ్డిని సత్కరించిన పట్టణ అధ్యక్షుడు



శ్రీకాళహస్తి, ఆగస్టు 7 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీంరెడ్డికి తెలుగుదేశంపార్టీ టిక్కెట్టు ఖరారు చేయడంతో సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు విజయకుమార్ సుధీర్‌రెడ్డిని దుశ్శాలువ, భారీ పూల మాల, పూలకిరీటంతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా పార్టీలో చంద్రబాబు నాయుడు సమక్షంలో చేరిన రాచగున్నేరి మాజీ సర్పంచ్‌ను దుశ్శాలువతో సుధీర్‌రెడ్డి సత్కరించారు.

## ఫార్మాసీలో కృష్ణవేణికి డాక్టరేట్



తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త : నగరానికి చెందిన ఓ విద్యార్థిని ఫార్మా విద్యలో తన ప్రతిభ చాటింది. తమలపాకుల యామిని కృష్ణవేణి అనంతపురం జేఎన్టీయూ అనుబంధం ఫార్మసీ కళాశాల ఆయన నిర్మల ఫార్మసీ కళాశాల నుండి డి ఫార్మసీలో డాక్టరేట్ పట్టా పొందారు. ఆగస్టు 4 తేదీన గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా కళాశాల చైర్మన్ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్ కుమార్, ఫాతిమా మెడికల్ కళాశాల డైరెక్టర్ జై మణి రెడ్డి తదితరుల చేతుల మీదుగా డిఫార్మా పట్టాను పొందారు. కృష్ణవేణి తండ్రి గిరిధర్ ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో టెక్నీషియన్‌గా, తల్లి ఆర్ దీప పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ ఫ్యాకల్టీగా సేవలందిస్తున్నారు. కృష్ణవేణి సాధించిన ఘనత పట్ల కళాశాలకు చెందిన యాజమాన్యం, అధ్యాపకులు, కుటుంబ సభ్యులు శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

## తనపల్లి శ్రీపద్మగిరిపై ఆడికృత్తికి ఉత్సవాలకు ఏర్పాట్లు





తిరుపతిరూరల్ ఆగస్టు 7 ప్రభాతవార్త : తిరుపతి రూరల్‌మండలం, తనపల్లె గ్రామ పంచాయతీలోని శ్రీపద్మగిరిపై వెలసియున్న శ్రీ దండాయుదాపాణి ఆడికృతికి ఉత్సవాలు మంగళవారం నుండి ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం భరణి, బుధవారం ఆడికృత్తిక ఉత్సవాలు అత్యంత వైభంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. తిరుపతి ప్రాంత భక్తులందరూ స్వామివారి కావళ్ళతో మొక్కులు చెల్లించుకోనున్నారని, మంగళవారం భరణి రోజు భక్తులు విశేష సంఖ్యలో పాల్గొంటారన్నారు. బుధవారం ఆడికృతిక రోజు శ్రీ దండాయుదాపాణి స్వామి వారి విశేష అభిషేకాలను, నైవేద్యాలు సమర్పించనున్నట్లు తెలిపారు. రెండురోజులు కొండపైకి విచ్చేయు భక్తులకు సకల సదుపాయాలు కల్పించినట్లు ఆలయ పూజారి షణ్ముఖస్వామి, నిర్వాహకులు వివరించారు.

## అంతర జిల్లాల బైక్‌ల దొంగ అరెస్ట్..12బైక్‌లు స్వాధీనం : డిఎస్పి

కోట,ఆగస్టు 7 ప్రభాతవార్త : అంతర జిల్లాల బైక్ దొంగ చీపినాపి మల్లికార్జున్ ను అరెస్ట్ చేసినట్లు గూడూరు డిఎస్పి సూర్యానారాయణ రెడ్డి వెల్లండిం చారు. ఆమేరకు సోమవారం కోట పోలీస్ స్టేషన్‌లో డిఎస్పి సూర్యానారాయణ రెడ్డి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడిం చారు.నెల్లూరు, తిరుపతి, ప్రకాశం జిల్లాలల్లో మోటార్ సైకిళ్లను దొంగతనం చేస్తున్న మల్లికార్జున్ కోట పోలీసులు చాక చాక్యంగా పట్టుకున్నారని తెలిపారు. కోడవలూరు మండలం గండవరం చెందిన తీపినాపి మల్లికార్జున్ వివిధ ప్రాంతాల్లో 12 మోటర్ సైకిళ్లను ఆహరించాడని పేర్కొన్నారు. మల్లికార్జున చెడు వ్యవసనాలకు బానిసగా మారి దొంగతనాలనే వృత్తి ఎంచుకొన్నాడని తెలిపారు. ఆమేరకు కోట,వాకాడు, చిట్టమూరు మండలాల్లో బైక్‌ల చోరీల కేసులు ఎక్కువగా నమోదు అవుతుండటంతో పోలీసులను ఒక టీంగా ఏర్పాటు చేసి నిఘా పెంచడం జరిగిందన్నారు. దీంతో మల్లికార్జున్ అతని తో పాటు మరో ఇద్దరుని కూడా గుర్తించడం జరిగిందన్నారు. నిందితుడు పై పలు కేసులు నమోదు అయినట్లు తెలిపారు. డిఎస్పి, వెంట కోట ఎస్ఐ జి.పుల్లారావు, వాకాడు ఎస్ఐరఘునాద్, చిట్టమూరు ఎస్ఐ గోపినాధలు ఉన్నారు.

## జీవనవేదాన్ని నాదంగా పలికించిన...ప్రజాగాయకుడు గద్దర్



తిరుపతి,ఆగస్టు 7ప్రభాతవార్త: ప్రజాచైతన్యంలో జీవనవేదాన్ని నాదంగా పలకించి ప్రజాగాయకుడు గద్దర్ పాట,ఆట బానిసబ్రతుకులనుండి బయట పడేసిందని రాయలసీమ రంగస్థలి సంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి తెలిపారు. కులం,మతం కాదు మనిషి బ్రతుకు బాటకు నేను గళం విప్పు తున్నానని జనం కోసం తపించిన గద్దర్ మరణం విప్లవకారులకు తీరని లోటన్నారు. ఆయన చిత్ర పటానికి కళాకారులు కెఎన్ రాజ, సుబ్రమణ్యం రెడ్డి, కేశవులురెడ్డి,శాంభోలు హరినాథ్, రంగారెడ్డి, కట్టమంచి చంద్రబాబు పుష్పాంజలి ఘటించారు.

## టిటిడి ఛైర్మన్‌గా సుబ్బారెడ్డి సేవలు అనుసరణీయం

### -టిటిడి నూతన ఛైర్మన్ భూమన



తిరుమల,ఆగస్టు 7ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ధర్మకర్తలమండలి ఛైర్మన్‌గా వైవి సుబ్బారెడ్డి అందించిన సేవలు అనుసరణీయమని టిటిడి నూతన ఛైర్మన్‌గా నియమితులైన తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి కొనియా డారు. సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా తన పదవీకాలంలో సామాన్యభక్తులకు మెరుగైన వసతులు కల్పించడానికి, దేవస్థానం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ప్రశంసిం చారు. సోమవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవన్‌లో చివరి ధర్మకర్తల మండలి సమావేశంలో సూబ్బారెడ్డిని కరుణాకర్‌రెడ్డి ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు.

## శివయ్య సేవలో కరికాల వల్లవన్



శ్రీకాళహస్తి,ఆగస్టు 7 ప్రభాతవార్త : రాష్ట్రదేవాదాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కరికాల వల్లవన్ సోమవారం వాయులింగేశ్వ రుని సన్నిధిలో స్వామి అమ్మ వార్లను దర్శించుకు న్నారు. ఆయన కుటుంబ సభ్యుల తో రాగా వారికి కార్యాలయం వద్ద శాసనసభ్యుడు బియ్యపు మదుసూధనరెడ్డి, ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,ఇఒ కె.వి.సాగర్‌బాబులు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆలయ మర్యాదలతో వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.ఏర్పాట్లను ఆలయ ఇఒ సాగర్‌బాబు, డెప్యూటి ఇఒ వెంకట సుబ్బయ్య, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్, సూపరింటెండెంట్ నాగభూషణం పర్యవేక్షించారు. ఆయనకు శాసన సభ్యుడు మధుసూధనరెడ్డి ప్రత్యేకంగా దారుశిల్పాన్ని, కలంకారి కళాఖండాన్ని అందించగా ఛైర్మెన్ శ్రీనివాసులు స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందించారు. ధర్మకర్తల మండలి సభ్యులు బుల్లెట్ శ్యాం, సాధన మునస్వామిరాయల్, సుమతి,ఎఇఒ సతీష్‌మాలిక్, వేదపండితులు హేమంత్‌శర్మ, శ్రీవాస్తవ్‌లు ఆశీర్వదించారు.

## చేనేత కార్మికుల దినోత్సవం: ర్యాలి

శ్రీకాళహస్తి,ఆగస్టు 7 ప్రభాతవార్త : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం శ్రీకాళహస్తిలోని చేనేత కార్మికులు, నాయకులు భారీ ఎత్తున పట్టణంలో భారీ ర్యాలి నిర్వహించారు. పట్టణంలోని భాస్కరపేటలోని కార్మికులు ర్యాలిలో చేనేత వస్త్రాలను ధరిద్దాం, నేత కార్మికులకు పని కల్పిద్దాం, వారి కుటుంబాలను ఆదుకుంటాము.పర్యావరణాన్ని కాపాడు కుందాం అని నినాదాలు చేస్తూ ర్యాలిని సాగించారు. ఈ వృద్ధ నాయకుడు కోస బాలసుబ్రమణ్యంను సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో కన్నా వెంకటేశ్వర్లు,సజ్జా చంద్రయ్య, సజ్జా శంకరయ్య, వెంకటేశ్వర్లు, చెన్నయ్య, జగదీశ్వరయ్య, అప్పిన సుధాకర్‌లు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 7 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహణ పై సమీక్షించారు. ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు ఉండాలని అన్నారు. ఈ సమీక్షలో డిఆర్ఓ కోదండరామిరెడ్డి, ఆడిషనల్ ఎస్‌పి కులశేఖర్, ఎస్డిసి భాస్కర్ నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం : జేసి



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 7 ప్రభాతవార్త : చేనేత కార్మికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిస్తున్నదని జేసి డికె బాలాజీ తెలిపారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ఆప్కో చేనేత వస్త్ర ప్రదర్శనశాలను ఆర్‌డిడి చేనేత, జౌళిశాఖ రాజా రావుతో జేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 7వ తేదిన జాతీయ చేనేత దినోత్సవం జరుపుకుంటారని, దీని ప్రాశస్త్యం ముఖ్యంగా సంప్రదాయ చేనేత పద్ధతులు, డిజైన్లను సంరక్షించడం ప్రోత్సహించడం చేనేత వారసత్వాన్ని గుర్తించి, వారి జీవనోపాధికి మద్దతు ఇవ్వడానికి ఇది ఒక వేదిక అని తెలిపారు. నవరత్నాలలో భాగంగా వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం క్రింద ప్రతి ఏటా రూ. 24,000 చొప్పున అర్హులైన చేనేత కార్మికులకు ఆర్థిక సహాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ ఎలాంటి అవినీతికి తావు లేకుండా చెల్లించడం జరుగుతోందని అన్నారు. వరుసగా ఐదో సంవత్సరం 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను చేనేత కార్మికులకు ఆర్థిక సాయాన్ని అందించే రాష్ట్ర స్థాయి కార్యక్రమం కార్యక్రమం వెంకటగిరి నుండి గత జులై నెల 21న ముఖ్యమంత్రి ప్రారంభించారని అందులో జిల్లాలోని 3447 మంది లబ్ధిదారులు 4.8 కోట్లు నిధులు వారి ఖాతాలో జమ చేయడం జరిగిందని గుర్తు చేశారు. జిల్లాలో 5771 మంది చేనేత కార్మికులకు వృద్ధాప్య పెన్షన్లు 2750 చెప్పున ప్రతినెల అందజేయడం జరుగుతుందని తెలిపారు. అంతే కాకుండా తిరుపతి జిల్లాలో క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో వెంకటగిరి భావన రుషి చేనేత క్లస్టర్ నందు 395 లబ్ధిదారులకు మొదటి విడతగా 41.25 లక్షలు చెన్నూరు బ్లాక్ లెవెల్ చేనేత క్లస్టర్‌కు మొదటి విడతగా 35.83 లక్షలు 369 లబ్ధిదారులకు రెండు క్లస్టర్స్ ఏర్పాటుతో వీటి నిర్వహణ చేనేత సేవా కేంద్రం విజయవాడ వారి ద్వారా జరుగుతోందని తెలిపారు. సుదీర్ఘకాలంగా చేనేత వృత్తిని కొనసాగిస్తున్న చేనేత కార్మికులను ఏవి కుట్టయ్య మొదలి నారాయణమ్మ, విలంబి పుత్తూరు, పట్నం రమేష్ వెంకటగిరి, కరుణాకర్ వెంకటగిరిలను జేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆప్కో ఇంచార్జి మేనేజర్ రమేష్, ఏపిఓ గోపాల్ కృష్ణ, డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీదేవి, ఏడిఓలు సుబ్బ నాయుడు, కిరణ్ కుమారి, సిబ్బంది, వివిధ చేనేత సొసైటీలు, నేత కార్మికులు పాల్గొన్నారు.

# చేనేత పరిశ్రమలకు ప్రభుత్వం చేయూతనివ్వాలి / మాజీ ఎంపిపి గంజి మాధవయ్య



పుత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త : నానాటికీ కనుమరుగుతున్న చేనేత పరిశ్రమ బతికి, బట్టకట్టేందుకు ప్రభుత్వం ఒక నిర్ధిష్ట ప్రణాళిక అమలు చేయాల్సిన అవసరం వుందని మాజీ ఎంపిపి గంజి మాధవయ్య తెలిపారు. సోమవారం స్థానిక రామకృష్ణాపురం పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ప్రసంగిస్తూ సమాజంలో వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మంది చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. స్వాతంత్యానంతరం ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి ఇచ్చిన ప్రాధాన్యతను చేనేత రంగానికి ఇవ్వలేదని తెలిపారు. వర్షాభావంతో చేనేత వృత్తి కనుమరుగైపోయి ప్రమాదం నెలకొందని, దానిపై ఆధారపడి జీవించే చేనేత కార్మికులు ఆర్థికంగా చితికిపోయి జీవనోపాధికి వేరే పనులు చేసుకుని జీవించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించి చేనేత రంగం పునర్ వైభవానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. చేనేత కార్మికులకు నలభై సంవత్సరాలు వచ్చేటప్పటికి కళ్లు కనపడకపోవడం, మోకాళ్ళ నొప్పులు రావడం సాధారణమని, అందువల్ల చేనేత కార్మికులకు 40 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేనేత యూనిట్లకు ప్రతి నెల ఉచితంగా 300 నుంచి 500 యూనిట్ల విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ఇల్లు కట్టుకునేందుకు రెండు, మగ్గం షెడ్ కోసం ఒక సెంటు కలిపి ప్రతి కార్మికుడికి మూడు సెంట్ల స్థలం ఉచితంగా ఇవ్వాలన్నారు. కొంత సబ్సిడీతో నూలు, పనిముట్లు ఇచ్చి ప్రోత్సహిస్తే చేనేత పరిశ్రమ నిలదొక్కుకుంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రానున్న రోజుల్లో ప్రతి జిల్లా నుంచి ఇద్దరు, ముగ్గురితో కమిటీలు వేసి చేనేత పరిశ్రమ పురుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం గంజి మాధవయ్యను స్థానిక నాయకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చేనేత సంఘాల నాయకులు నూకల కృష్ణయ్య, మరిబాబు, ధశరధ, కృష్ణమూర్తి, మునివాసులులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు



వడమాలపేట, ఆగస్టు 7 ప్రభాతవార్త: మండలంలోని అప్పలాయగుంట పంచాయతీ పరిధిలోని వడ్డిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటరవి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని పిల్లలకు అందుతుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి అంగన్‌వాడీ కార్యకర్త పని తీరును, సరకులు అందజేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అన్ని సక్రమంగా జరుగుతున్నాయని కార్యకర్త పని తీరు బాగుందని అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ధనంజయ్, సీడీపీవో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఇసుక దందాలకు పాల్పడుతున్నారు

### -ఐటిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి

పుత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త : రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా నగరి నియోజకవర్గంలో భూమి, ఇసుక, గ్రావెల్ దందాలకు పాల్పడుతున్నారని తెలుగుదేశం పార్టీ ఐటిడిపి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఉండవల్లి అనూష ఆరోపించారు. ఒక కేసు విషయమై సోమవారం పుత్తూరు కోర్టుకు హాజరైన సందర్భంగా ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఆస్తులేమీ లేవని చెప్పిన ఆమె విజయవాడ, తిరుపతి తదితర నగరాల్లో ఇళ్లు, భూములు కొనుగోలు చేశారని తెలిపారు. అవినీతికి పాల్పడడం వల్లే రోజా ఆస్తులు కొనుగోలు చేయగలిగారని తెలిపారు. ప్రశ్నించిన టిడిపి నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో రోజా ఓటమి, తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భానుప్రకాశ్ విజయం ఖాయమని పేర్కొన్నారు.

## నగరిలో హరిత భారత్-స్వచ్ఛభారత్‌పై విద్యార్థుల భారీ ర్యాలీ



నగరి, ఆగస్టు 7 ప్రభాతవార్త : పుత్తూరు మండలం పరమేశ్వరమంగళంలోని శ్రీ చైతన్య పాఠశాల-2 విద్యార్థులు నగరి పట్టణంలో ఓంశక్తి ఆలయం నుంచి టవర్ క్లాక్ వరకు హరిత భారత్- స్వచ్ఛ భారత్ కార్యక్రమంపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నగరి సిఐ సురేష్ మాట్లాడుతూ భావి తరాలకు చెట్లను అందించాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. కావున చెట్లను నాటడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం నగరి పోలీస్‌స్టేషన్ ఆవరణలో చెట్లను నాటారు. ర్యాలీ విజయవంతానికి సహకరించిన పోలీసులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం సురేష్, అకాడమిక్ కో కో ఆర్డినేటర్ బాలాజీ, పాఠశాల ప్రిన్సిపాల్ కె.సుధ, పాఠశాల డీన్ సంపత్ కుమార్, సి బ్యాచ్ ఇంచార్జ్ వినోద్, సౌమ్య, నాగేష్, పిఇటి మహాదేవ్, పాఠశాల అధ్యాకులు, విద్యార్థులు అందరు పాల్గొన్నారు.

## ట్రాక్టర్‌పై ఊరేగిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి



నారాయణవనం, ఆగస్టు 7 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణ వనంలో ప్రసిద్ధి చెందిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజుల స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు సోమవారం సాయంత్రం ట్రాక్టర్‌పై అరోహించి సప్రవాహనంపై తిరువట్యం గ్రామంలో మంగళ వాయిద్యాలు, భాణసంచావేడుకల నడుమ ఘనంగా ఊరేగారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త టిఎస్. సౌరకాయులురెడ్డి, మాజీ సర్పంచ్ ఎస్.భారతిపురుషోత్తంరెడ్డి, ముని ప్రసాద్‌రెడ్డి, మునిబాబు, గుణశేఖర్, ఏకాంబరంశెట్టి, మునిరెడ్డి, గోపిరెడ్డి, భక్తులు అధికస ఖ్యలో పాల్గొన్నారు.

## బిపి మండల్ డే వేడుకలు




తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 7 ప్రభాతవార్త : మండల్ డే సందర్భంగా బీసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం డిబిఆర్ రోడ్‌లో ఉన్న తిరుపతి బిపి మండల్ విగ్రహానికి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష పాల్గొని పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నగర మేయర్ శిరీష, బిసి సంఘర్షణ సమితి నాయకులు మాట్లాడుతూ బీపీ మండల్ 1979లో కమిషన్‌చైర్మన్‌గా 13 నెలలు తిరిగి భారతదేశవ్యాప్తంగా బీసీల స్థితిగతులపై అధ్యయనం చేయడం జరిగిందన్నారు. 1980లో కమిషన్ రిపోర్టు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించడం జరిగిందన్నారు. బిపీ మండల్ ఇచ్చినటువంటి కమిషన్ రిపోర్టుని పది సంవత్సరాల పాటు అమలుకి నోచుకోకుండా దాచి పెట్టడం జరిగిందని 1990లో జనతా ప్రభుత్వంలో విపి సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు పార్లమెంట్‌లో బిల్లు పెట్టడం జరిగిందన్నారు. ఓబిసిలకు 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని సభలో బిల్లు పెట్టినప్పుడు అగ్రకులాలకు చెందినటువంటి వారు పెద్ద ఎత్తున గొడవ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షులు అక్కెనపల్లి లక్ష్మయ్య, బివి కేశవులు, బుసగాని లక్ష్మయ్య యాదవ్, సాకం ప్రభాకర్, కట్టమంచి చంద్రబాబు యాదవ్, అశోక్ సామ్రాట్ యాదవ్, గుండ్లురు వెంకటరమణ, వడ్డెర సంఘం రమణ, శ్రీమంతుల రామయ్యచారి, దాసరి సంఘం వెంకటరమణ, దాము, శివ, మహిళా నాయకురాలు విజయలక్ష్మి, టౌన్ బ్యాంకు వైస్ ఛైర్మన్ వాసు యాదవ్, వెంకట రమణ, రజక సంఘాలు, విశ్వబ్రాహ్మణ సంఘాలు, యాదవ సంఘాలు, గౌడ్ సంఘాలు, ముదిరాజ్ సంఘాలు, వాల్మీకి, బోయ సంఘాలు, నాయి బ్రాహ్మణ సంఘాలు పాల్గొన్నారు.

## డాక్టర్ హరికృష్ణ సేవలు అభినందనీయం : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 7 ప్రభాతవార్త : డాక్టర్ హరికృష్ణ సేవలు అభినందనీ యమని కమిషనర్ హరిత అన్నారు. నగర పాలక సంస్థ హెల్త్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీ పై వెళ్తున్న డాక్టర్ హరికృష్ణకు వీడ్కోలు, నూతన హెల్త్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ యువ అవినాష్ రెడ్డికి ఆహ్వాన కార్యక్రమం సోమవారం నగర పాలక సంస్థ కార్యలయంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల కాలంలో కరోనాలో ఎవ్వరూ బయటకు రాని సమయంలోహెల్త్ ఆఫీసర్‌గా ఆయన ప్రజలకు ఎనలేని సేవలు అందించారన్నారు. అలాగే నగరంలో పరిశుభ్రత చర్యలు నిర్వహణలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు. అనంతరం డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ నగర పాలక సంస్థలో పని చేయడం నా పూర్వ జన్మ సుకృతం అన్నారు. తనకు సహకరించిన అధికారులు, సిబ్బందికి తాను ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ ఆఫీసర్స్ సేతు మాధవ్, కేఎల్ వర్మ, డిసిపి శ్రీనివాసులు రెడ్డి, ఏసిపి బాలసుబ్రమణ్యం, కార్యదర్శి రాధిక, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, డిఈలు, తదితరులు పాల్గొన్నారు.

## పాలమంగళం ఓ ఇంట్లో చోరీ -4.50 లక్షల అపహరణ



నారాయణవనం, ఆగస్టు 7 ప్రభాతవార్త: మండలంలోని పాలమంగళం దక్షిణపు కండ్రిగకు చెందిన నవీన్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గత నెల 28న సొంత పనుల నిమిత్తం నవీన్ కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు వెళ్ళారు. ఈనెల 5న తిరిగి వచ్చిన తర్వాత ఇంటి తలుపులు బీరువా బీగాలు పగుల గొట్టి అందులోని 4.50 లక్షలు విలువ గల బంగారు ఆభరణాలు, నగదు, చోరీగి గురైనట్లు స్థానిక ఎస్సై పరమేష్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. గత రెండు రోజులుగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# టిడిపి టిక్కెట్టు నాకే..విజయాన్ని సొంతం చేసుకునేది నేనే!-బొజ్జల



తొట్టంబేడు, ఆగస్టు 7 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజవర్గ తెలుగుదేశంపార్టీ టిక్కెట్టు తనకే అని, విజయం సాధించి తీరుతామని బొజ్జలసుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం శ్రీకాళహస్తి పట్టణానికి విచ్చేసిన తెలుగుదేశంపార్టీ అధినేత జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారని నియోకజవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ తరపున టిక్కెట్టు తనకు ఖరారు చేసినట్లు ప్రకటించడంతో పార్టీ కార్యాలయంలో భారీ ఎత్తున టపాకాయలు మోత మ్రోగింది. రాష్ట్రంలో 4వ టిక్కెట్టు తనకే ప్రకటించడం సంతోషంగా ఉందని, తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ కూడా తనకు ఫోన్‌చేసి శుభాకంక్షలు తెలిపినట్లు వివరించారు. పార్టీకోసం అహర్నిశలు శ్రమించిన తన తండ్రి దివంగత నేత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, తన చిన్నాన్న బొజ్జల హరనాథ్‌రెడ్డిలు ఎలా పాటు ముందుకు నడిపించారో వారి బాటలోనే తాను వెళ్తానన్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు జగన్ పాదయాత్రలో వెళ్తూవెళ్తూ శ్రీకాళహస్తికి ఓరాక్షసుడిని ప్రతినిధిగా ఇచ్చివెళ్ళాడని ధ్వజమెత్తారు. ఆదివారం ఎంఎల్ఏ మధుసూధన్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా మాట్లాడం తగదన్నారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసిన ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు, శనివారం రోజున సహకరించిన వ్యాపారస్తులకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశానికి మాజీ ఎంఎల్ఏలు సత్రవాడ మునిరామయ్య, ఎస్సీవీనాయుడులు ఎందుకు రాలేదని ప్రశ్నించగా తాను ఫోన్‌చేశానని వారు బయట ఉన్నారని చెప్పారన్నారు. కరోనా సమయంలో కోట్లు ఖర్చుపెట్టి ప్రజలకు చికెన్, గుడ్లు, బియ్యం, టమోటలు పంపిణీచేశానని గత నాలు గేళ్ళుగా చెప్పుకుంటున్న ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డికి చేసిన ప్రజలకు ప్రజాప్రతినిధులు సేవచేసేందుకే ఉన్నారని తెలియదా? అని ప్రశ్నించారు. ఒక్కరోజు చికెన్, గుడ్లు, ఇచ్చేసి ఏడాది మొత్తం పోషించినట్లు చెప్పుకుంటు న్నారని విమర్శించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో గుడిలెక్క మొత్తం బయటకు తీసి ప్రజలకు వివరిస్తానని తన చిన్నాన్న హరనాధరెడ్డిని చంపేశానని ఇప్పుడు తనపై కేసు పెడుతానని చెప్తున్నారని 14నెలలుగా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తనకు తన తమ్ముడికి విబేధాలు ఉన్నట్లు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. సమావేశంలో బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డితో పాటు, పోలూరుశ్రీనివాసులురెడ్డి, మాజీ కౌన్సిలర్స్ రేణుకమ్మ, కాళప్పరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు గాలిచలపతినాయుడు, రెడ్డివారిగురవారెడ్డి, నాయకులు చెలికం పాపిరెడ్డి, మాజీ పాలసరఫరా ఛైర్మన్ మునిరాజనాయుడు,రంగినేని చెంచయ్యనాయుడు, బొల్లినేని జగన్నాదంనాయుడు, డిల్లీబాబు, సుబ్బయ్య, నెమళ్ళూరు సుబ్రమణ్యం (బుజ్జి), షాకిరాలీ, అస్మత్, మునిరాజయాదవ్, మిన్నల్‌రవి, కాసరం రమేష్, కిషోర్, బత్తిరెడ్డి, తొట్టంబేడు పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాథంనాయుడు, తాటిపర్తి ఈశ్వరయ్య, దుర్గాప్రసాద్‌లతోపాటు పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు : జిల్లా ఎస్పి



తిరుపతి క్రైం, ఆగస్టు 7 ప్రభాతవార్త : స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రజల సమస్యలకు, ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎస్పి కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 61 ఫిర్యాదులు అందాయి. జిల్లా ఎస్పి పరమేశ్వరరెడ్డి ప్రజల సమస్యలకు సానుకూలంగా స్పందించి, ప్రతి ఒక్కరి కేసు విషయాలను కుశలంగా అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులందరితో ఎస్పి మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుటుంబం కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా కారణాలతో ఫిర్యాదులు చేశారు. స్పందన ఫిర్యాదులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, ఫిర్యాదులను చట్టప్రకారం విచారణ జరిపించి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు.